క్లుప్తంగా

ఘనంగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు



వెంకయ్యస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: స్థానిక పాతవూరు నల్లకాలువ బ్రాహ్మణరేవు వద్ద ఉన్న భగవాన్ వెంకయ్య స్వామి వారి ఆలయంలో స్వామివారి 9వ వార్షిక ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు బుధవారం వెంకయ్య స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టెలిఫోన్ గురుస్వామి, ఆలయ కమిటీ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



ఆరోగ్య సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు

గోకవరం: మండలంలోని అచ్చయ్యపేటలో అంగన్‌వాడీ సెంటర్‌ను జిల్లా వైద్య శాఖ అధికారి వెంకటేశ్వరరావు బుధవారం తనిఖీ చేశారు. ఫ్యామిలీ ఫిజిషియన్, మాతా శిశు సంరక్షణా సేవలు, వ్యాధి నిరోధక టీకాలు తదితర సేవలపై ఏఎన్‌ఎంలను ఆరా తీశారు. అనంతరం ఆశా యాప్‌పై సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యులు తిరన్, ఆలేఖ్య, మేరీ, కృప, ఎంపీహెచ్ఈఓ రాయుడు, సిబ్బంది ఉన్నారు.

జయహో భారత్

సీతానగరం: చంద్రయాన్ 3 ప్రయోగాన్ని సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో ఇన్‌చార్జి హెచ్‌ఎం కస్నూరి సతీష్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థులు వీక్షించారు. సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు విక్రమ్ ల్యాండర్ జాబిల్లిపై ల్యాండ్ అయిన తీరును వీక్షించారు. అనంతరం విద్యార్థులు జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో విజయోత్సవం జరుపుకొన్నారు.

రూ.పదివేలు మాయం

సీతానగరం: రఘుదేవపురానికి కాట్నం వెంకటేశ్వరరావుకు ఎస్‌బీఐ సీతానగరం శాఖలో ఖాతా ఉంది. అందులోంచి రూ.10 వేలు డ్రా చేసినట్లు బుధవారం ఉదయం 7.16 గంటలకు మెసేజ్ వచ్చింది. దీంతో బ్యాంక్ మేనేజర్‌కు సమాచారం అందించగా వేలుముద్ర వేసి డబ్బులు తీసుకున్నట్లు ఉందని, ఎక్కడైన వేలిముద్ర వేశారా అని ప్రశ్నించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వారం రోజుల క్రితం వేలిముద్ర వేశారని వెంకటేశ్వరరావు తెలిపారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

బిక్కవోలు: ప్రతి ఒక్కరూ యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని విశ్వ మానవతా సంస్థ వ్యవస్థాపకులు అల్లూరి శ్రీనివాస్ చౌదరి పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక మదుగులమ్మ తల్లి గుడి వద్ద గల విశ్వమానవత సంస్థ సంస్కార విద్య గ్రంథాలయంలో జరిగిన హోమియోపతి వైద్య శిబిరంలో నిర్వహించారు. ప్రతి బుధవారం హోమియోపతి వైద్య నిర్వహిస్తున్నారని ఈ అవకాశం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యోగ సాధనతో ఎన్నో రోగాలు తగ్గించవచ్చును అని తెలిపారు. ఈ కార్యక్రమలోని యోగ థెరపిస్టు నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనుల పరిశీలన



సుభద్రంపేటలో జలజీవన్ మిషన్ పనులను పరిశీలిస్తున్న కేంద్రబృందం సభ్యులు

రంగంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో గ్రామాల్లో చేపట్టిన జల జీవన్ మిషన్ పనులను కేంద్ర బృందం బుధవారం పరిశీలించింది. రంగంపేట మండల పరిధిలోని సుభద్రంపేట, వెంకటాపురం గ్రామాల్లో చేపట్టిన జల జీవన్ మిషన్ పనులను బృందం సభ్యులైన ఛీఫ్ ఇంజినీర్లు సామిత్ర సేన్ గుప్తా, జి.ఎ.బేగ్ పరిశీలించారు. పనుల ప్రగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికులతో జల జీవన్ మిషన్ పథకంపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, సర్పంచ్‌లు కూటి సాయితాతారావు, ముంగి గంగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఎస్.రవికుమార్, ఏఈ కిషోర్, పంచాయతీ కార్యదర్శి మణికుమార్, ఓపీఆర్డీ ఎస్.కాత్యాయనీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిలో అగ్రస్థానాన రాజానగరం

- సమష్టి కృషితోనే ఇది సాకారం
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా



వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులను సన్మానించిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, చిత్రంలో జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: గడిచిన నాలుగేళ్లలో సమష్టిగా పని చేసి, నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రస్థానాన నిలిపామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఇందుకు పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషే కారణమన్నారు. మండలంలోని దివాన్‌చెరువులో బుధవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇదే ఒరవడితో పయనిస్తూ, రాబోయే ఎన్నికలలో విజయబావుటా ఎగురవేద్దామన్నారు. గతంలో పొందిన మెజార్టీ కంటే అధిక మెజార్టీతో విజయం సాధించేలా, ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూ. వెయ్యి కోట్లు, ప్రజా సంక్షేమానికి రూ. వెయ్యి కోట్లు ఖర్చు చేశారన్నారు. సుమారు 20 వేల మంది పేదలకు నివాస స్థలాలు పంపిణీ చేసి, వాటిలో పక్కా ఇళ్లు కట్టుకునే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరూ ప్రయోజనం పొందుతున్నారన్నారు. దీనిని ప్రజలలోకి తీసుకువెళ్లి, చైతన్యం తీసుకురావాలన్నారు. ఇందుకోసం మరోసారి ఇంటింటికీ వెళ్లి, ప్రజలకు అవగాహన కలిగించడంతోపాటు ప్రతిపక్షాల విమర్శలను, తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. ఆయనకు మళ్లీ ఆశీర్వదించాలని కోరారు.

అర్హులందరికీ పథకాలు

వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ కులం, మతం, పార్టీలతో సంబంధం లేకుండా అర్హత ఉంటే చాలు ప్రతి ఒక్కరికీ సంక్షేమం పథకాలు అందుతున్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ప్రజలను జలగల్లా పీల్చికుతినేవన్నారు. జక్కంపూడి కుటుంబానికి పార్టీ నాయకులు, కార్యకర్తలే బలమన్నారు. అనంతరం దివాన్‌చెరువు గ్రామ కమిటీ సమావేశం కూడా జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులను ఘనంగా సన్మానించారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు రాజశేఖర్, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అడబాల చినబాబు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, నాయకులు గంగిశెట్టి సోమేశ్వర్రావు, కొండపల్లి దుర్గారావు, దాసి వెంకట్రావు, వేమగిరి కృష్ణ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆరుగురికి బంగారు వరలక్ష్మి రూపులు



గాదెలపాలెంలో మహిళకు బంగారు రూపు అందజేస్తున్న కంబాల శ్రీనివాసరావు

గోకవరం: ఆధ్యాత్మిక ప్రచార కార్యక్రమంలో భాగంగా మండలంలోని గాదెలపాలెంలో ఆరుగురు మహిళలకు బంగారు వరలక్ష్మీ కానుక పేరుతో బుధవారం గ్రాము చొప్పున బంగారు రూపులు పంపిణీ చేశారు. స్థానిక దేవీచౌక్ ఆలయం నుంచి గాదెలపాలేనికి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వంద బైక్‌లపై ర్యాలీగా వెళ్లారు. వంద మంది మహిళలు బంగారు వరలక్ష్మీ కానుక లాటరీకి నమోదు చేసుకోగా లాటరీ ద్వారా ఆరుగురిని ఎంపిక చేసి బంగారు రూపులు అందజేశారు. కార్యక్రమంలో దేవీచౌక్ ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌రావు, ఆలయ సేవకులు వరసాల ప్రసాద్, తామర్ల రాంబాబు, మామిడి అయ్యప్ప, ఇనకోటి బాపన్నదొర, పోశిన ప్రసాద్, బండి మణి, మెకానిక్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి మండల విభజన పేరుతో కొత్త నాటకం

- అఖిలపక్షం పేరుతో విపక్షాల దుష్ప్రచారం
- రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సత్తి రామకృష్ణారెడ్డి

అనపర్తి: అనపర్తి మండలాన్ని విభజిస్తున్నారంటూ అఖిలపక్షం పేరుతో విపక్షాలు దుష్ప్రచారం చేస్తూ ఓ కొత్త నాటకానికి తెరతీశాయంటూ వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి విమర్శించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అనపర్తి మండలాన్ని విభజిస్తున్నారంటూ అఖిలపక్షం పేరుతో విపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన ఖండించారు. దున్నపోతు ఈనింది దూడను కట్టేయండి అన్న చందంగా విపక్షాలు తీరు ఉందని అన్నారు. మండలంలోని దుప్పలపూడి గ్రామ పంచాయతీ పరిధిలో రెండు వార్డు స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ సానుభూతిపరులుగా పోటీలో నిలిచిన ఇరువురు అభ్యర్థులకు డిపాజిట్లు కూడా రాలేదని, ఘోర పరాజయం చవిచూసిన టీడీపీ నాయకులు దీనిని నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే అనపర్తి మండల విభజన అంటూ దుష్ప్రచారం చేస్తూ రాజకీయ ప్రయోజనాన్ని పొందేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. తన పార్టీ మద్దతుతో పోటీకి దిగిన వార్డు సభ్యులను కూడా గెలిపించుకోలేని నాయకుడి నేతృత్వంలో టీడీపీ ప్రతినిధులు, బీజేపీ నుంచి సస్పెండ్ అయినా బీజేపీ సీనియర్ నాయకుడినంటూ చెప్పుకుని తిరిగే ఒకరు, కనీసం పంచాయతీ వార్డు సభ్యులుగా తమ పార్టీ సానుభూతిపరులను ఎన్నికల బరిలో నిలపలేని చేతగాని, చేవలేని మిగిలిన పార్టీలకు చెందిన నాయకులు మండల విభజన పేరుతో చేస్తున్న ఆరోపణలు గమనిస్తున్న మండల ప్రజలు వారిని ఛీత్కరించుకుంటున్నారని అన్నారు. గత సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి వచ్చిన రికార్డు మెజార్టీలో కీలక భూమిక పోషించిన అనపర్తి మండల ఓటర్ల భాగస్వామ్యాన్ని దెబ్బతీయాలన్న కుట్రలో భాగంగానే మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మండల విభజన ప్రచారానికి తెరతీసారని ఆరోపించారు. ఎవరు ఎన్ని కుయుక్తులు పన్నినా రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా డాక్టర్ సూర్యనారాయణరెడ్డి గెలుపును అడ్డుకోలేరని రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి

రాజానగరం: విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ర్యాగింగ్ నిషేధంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యూష కుమారి మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు హితవు పలికారు. కళాశాలలలో, బయట సహ విద్యార్థులను వేధించడం, వారి ఆత్మాభిమానాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించడం వంటి వికృత చేష్టలకు పాల్పడితే తక్షణమే డిబార్ చేసే అధికారం ఆయా కళాశాల యాజమాన్యాలకు ఉంటుందన్నారు. అలాగే కాగ్నిజబుల్ నేరంగా పరిగణించి కోర్టు అనుమతి లేకుండా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసే అధికారం పోలీసులకు ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ర్యాగింగ్ నిషేధం చట్టం 1997లోని వివిధ అంశాలపై అవగాహన కలిగించారు. ఏఎస్పీ జి. వెంకటేశ్వర్రావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి, డాక్టర్ ఎన్.లీలావతి, రాజానగరం సీఐ కాశీవిశ్వనాథ్, పారా లీగల్ వలంటీర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తి జయంతి వారోత్సవాలు



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

బిక్కవోలు: తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చి నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్నీ తెలియజెప్పిన మహనీయుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు అని కొంకుదురు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లిపూడి శ్రీనివాస్ అన్నారు. బుధవారం కొంకుదురు గ్రామంలోని ఉన్నత గిడుగు రామూర్తి జయంతి వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయుడు మాదిరెడ్డి వీర వెంకట సత్యనారాయణ చౌదరి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆంధ్ర దేశంలో వ్యవహారిక భాషోద్యమానికి మూల పురుషుడు, బహు భాషా శాస్త్రవేత్త చరిత్రకారుడు, సంఘ సంస్కర్త గిడుగు అని అన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, కవితలు, సామెతలు, కథలు, వ్యాసరచన మొదలైన అంశాలలో పోటీలను నిర్వహించారు. రామ్మూర్తి జయంతి రోజైన 29న విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలోని ఉపాధ్యాయులు శ్రీ కృష్ణసాయి, ఈశ్వరరెడ్డి, లక్ష్మణరెడ్డి, అప్పారావు, వలీషా తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 చారిత్రక విజయం



దివాన్‌చెరువు శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో సంబరాలు



తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్న అనపర్తి జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు



జి.మామిడాడ బీజేపీ కార్యాలయంలో సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: చంద్రుని దక్షిణ ధృవ ప్రాంత అన్వేషణకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) చేపట్టిన చంద్రయాన్-3 యాత్ర విజయవంతం కావడంతో అంతరిక్ష పరిశోధనలో భారత తనదైన ముద్ర వేసిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 40రోజుల అంతరిక్ష ప్రయాణం తరువాత బుధవారం సాయంత్రం జాబిల్లి ఉపరితలంపై చంద్రయాన్-3 అడుగుపెట్టడంతో అంతరిక్ష పరిశోధన రంగంలో భారత సరికొత్త రికార్డు నెలకొల్పిందని అన్నారు. చంద్రుడి దక్షిణ ధృవంపై అడుగుపెట్టిన తొలి దేశంగా భారత్ అవతరించడం భారతీయులందరికీ గర్వకారణమన్నారు. గత నెల 14న ప్రయోగించిన చంద్రయాన్-3 విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేసి, ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేశారు.

ఇది లావుండగా చంద్రయాన్-3 ల్యాడింగ్‌ను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించిన స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంతో జాతీయ జెండాను ఊపుతూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

విద్యార్థుల ర్యాలీ

గోకవరం: చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంతో గోకవరంలోని రాజా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు బుధవారం రాత్రి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కరస్పాండెంట్ పట్నాల సూర్యప్రకాష్‌రావు, ప్రిన్సిపల్ రమానాగలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా జాతీయ జెండాను పట్టుకుని జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు.

దేశ ప్రజలకు పండగ

పెదపూడి: సేఫ్ ల్యాంగింగ్‌తో చంద్రయాన్-3 ప్రయోగం సంపూర్ణ విజయం సాధించడం యావత్ భారత దేశ ప్రజలకు ఇది పండుగ రోజు అని ఎంపీపీ కేతా తులసి అభివర్ణించారు. జి.మామిడాడ గ్రామంలో బుధవారం ఆమె చంద్రయాన్-3 సేఫ్ ల్యాండింగ్ విజయంపై హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

బీజేపీ కార్యాలయంలో సంబరాలు

జి.మామిడాడ గ్రామంలోని బీజేపీ కార్యాలయంలో చంద్రయాన్-3 విజయంపై సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి హరినారాయణరెడ్డి మాట్లాడుతూ చంద్రయాన్-3 చిరకాల ఆకాంక్ష నెరవేరిందన్నారు. భవిష్యత్‌లో ఇస్రో చేపట్టబోయే అంతరిక్ష పరిశోధనలు ప్రయోగాలకు చంద్రయాన్-3 విజయం గొప్ప ప్రేరణనిస్తుందన్నారు.

అభినందనలు

బిక్కవోలు: చంద్రయాన్-3 చరిత్ర సృష్టించింది. జాబిల్లిపై ఇప్పటి వరకు ఏ దేశం దిగని దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండర్ కాలు మోపిడంతో మండలంలోని పలు ప్రాంతాల ప్రజలు శాస్త్రావేత్తలకు, కేంద్రప్రభుత్వానికి అభినందలు తెలియజేశారు. మండలంలోని ఆర్‌ఎస్‌పేట వద్ద మాజీ సర్పంచి యామన దుర్గారావు ఆధ్వర్యంలో జాతీయ జెండా ఎగురవేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు గువ్వల సత్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పందలపాక ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు చంద్రయాన్ ప్రయోగం విద్యార్థులు చూపించారు. కొంకుదురు ఉన్నత పాఠశాలు చంద్రయాన్-3 విజయంతో అభినందలు తెలియజేశారు.

రాజానగరం: దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో సంబరాలు మిన్నంటాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు జాతీయజెండాలతో సందడి చేశారు.

విద్యుత్ మీటర్లకు సచివాలయాల్లో దరఖాస్తులు



కోటపాడు గ్రామంలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న ఈఈ శ్రీధర్ వర్మ

రంగంపేట: విద్యుత్తు వినియోగదారులందరూ కొత్త మీటర్ల కోసం ఇకపై గ్రామ, వార్డు సచివాలయాల్లోనే దరఖాస్తు చేసుకోవాలని రాజమహేంద్రవరం రూరల్ డివిజనల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ దొడ్ల శ్రీధర్ వర్మ తెలిపారు. బుధవారం ఆయన మండల కేంద్రమైన రంగంపేట విద్యుత్తు సబ్ స్టేషన్‌ను సందర్శించి అనంతరం సబ్ స్టేషన్ పరిధిలోని కోటపాడు, వెంకటాపురం, మర్రిపూడి, నల్లమిల్లి గ్రామాల్లోని విద్యుత్తు లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు పరిశీలించారు. అనంతరం విద్యుత్ సంబంధిత అంశాలపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్తు వినియోగదారులందరూ బిల్లులు ఆన్‌లైన్‌లోనే పేమెంట్ చేయాలన్నారు. విద్యుత్ సర్వీసులకు ఆధార్ తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో అనపర్తి ఏడీఏ పి.సన్యాసిరావు, ఏఈ రాయుడు రాంబాబు పాల్గొన్నారు.

వైద్యానికి అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



రంగంపేట పీహెచ్‌సీలో అదనపు భవనాల నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆయన అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇప్పటికే రూ.1.15 కోట్లతో అదనపు గదులు నిర్మించారని, ప్రస్తుతం మరో రూ.60 లక్షలతో మరో కొన్ని గదుల నిర్మాణానికి భూమిపూజ చేశామన్నారు. మొత్తం రూ. 1.75 కోట్లతో రంగంపేట పీహెచ్‌సీ అభివృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీకో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు పోతుల బులివీర్రాజు, పంచాయితీరాజ్ జేఈ కె. శ్రీనివాసరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బిక్కవోలు: స్థానిక పీహెచ్‌సీ వద్ద రూ.50లక్షలతో జరగనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శంకుస్థాపన చేశారు. బుధవారం బిక్కవోలు పీహెచ్‌సీ వద్ద బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్, ఆరు పడగల గదులకు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో కంటే ప్రస్తుత ప్రభుత్వం పీహెచ్‌సీల్లో మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోందన్నారు. వాటిని ప్రజలకు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలోని ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి,పిహెచ్‌సీ వైద్యులు దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరికి నివాళి



టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన సర్పంచ్ కుమారి, ఎంపీడీఓ హిమమహేశ్వరి



కాపవరంలో ప్రకాశం పంతులు జయంతి



సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో..



పెదపూడిలో టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎంపీడీఓ విజయభాస్కర్

అనపర్తి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి నేతృత్వంలో కార్యాలయం సిబ్బంది టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి, పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సైమన్ కమిషన్‌కు ఎదురెళ్లి తన గుండెను చూపి దమ్మంటే కాల్చుమని సవాల్ విసిరిన టంగుటూరి ఆంధ్రకేసరిగా పేరు గాంచారన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కుటుంబాన్ని ఒదిలి ఉద్యమం కోసం తన జీవితాన్ని అంకితం చేయడంతోపాటు ప్రజా సేవలో తనకంటూ ఏమీ మిగుల్చుకోని నిజమైన నేత టంగుటూరి ప్రకాశం పంతులని అన్నారు. భాషా ప్రాతిపదికన ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా ప్రకాశం తెలుగు భాషకు, రాష్ట్రానికి ఎంతో కృషి చేశారని ప్రకాశం పంతులు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముఖి చిట్టిరాజు, ఎంపీడీఓ, సచివాలయ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మధురపూడి: కాపవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంత్యుత్సవం నిర్వహించారు. నర్సాపురం పంచాయతీ కార్యక్రమంలో సర్పంచ్ కడియాల పాపారావు ఆధ్వర్యంలో జయంతి జరిగింది.

సీతానగరం: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ధైర్యసాహసాలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు కస్నూరి సతీష్‌బాబు అన్నారు. సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో బుధవారం ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో పీడీ సింహాద్రి, శంకర్రావు, ఉపాధ్యాయులు రాజేష్, నిర్మల రాజేశ్వరి పాల్గొన్నారు.

పెదపూడిలో..

పెదపూడి: మండల పరిషత్ కార్యాలయంలో ఆంధ్రరాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 151వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ విజయభాస్కర్ ముందుగా ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏపీఓ కాంచన, ఏఓ శ్రీనివాసు పాల్గొన్నారు.